సామాజిక విప్లవకారుడు వీరబ్రహ్మేంద్రస్వామి



వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాలను విడుదల చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ రమేష్ తదితరులు

నాగోలు: సామాజిక విప్లవకారుడు, సంఘసంస్కర్త, కాలజ్ఞాన సృష్టికర్త, మూఢనమ్మకాలను తరిమికొట్టిన మహానుభావుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్, వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి కొనియాడారు. గురువారం కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో బ్రహ్మంగారి ఆలోచన – మన కర్తవ్యం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఇంద్రవెల్లి రమేష్ మాట్లాడుతూ, అంటరానితనం ఉన్న ఆ రోజుల్లో కుల మత వర్గ వర్ణాలకు అతీతంగా జ్ఞానాన్ని బోధించిన మహా జ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి అని అన్నారు. పాండురంగా చారి మాట్లాడుతూ, ట్యాంక్ బండిపై ఉన్న బ్రహ్మం విగ్రహం దగ్గర శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధన కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాలను విడుదల చేశారు. సామాజిక ఉద్యమకారుడు మోహన్ బైరాగి, వర్కర్స్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ దుర్గే, బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మారోజు సునీల్ కుమార్, వర్కర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రాములు, నాయకులు బడే అజయ్ కుమార్, కృష్ణమాచారి, శ్యాంసుందర్, సోమేశ్వరరావు, శ్రీకాంతాచారి, విజయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇన్‌లైన్ స్కేటింగ్ హాకీ క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందనలు



నందితను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఇటలీలో ఆగస్టులో నిర్వహించే ఇన్‌లైన్ స్కేటింగ్ హాకీ సీనియర్ మహిళల వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొనే ఇండియా జట్టును రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీకి చెందిన క్రీడాకారిణి టంగుటూరి నందితకు ఈ జట్టులో స్థానం కల్పించింది. ఈ నేపథ్యంలో తండ్రి నాగరాజుతో కలిసి నందిత గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. నందితను అభినందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌కు చెందిన బాలిక అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రెండేళ్ల క్రితం వనస్థలిపురంలో రోలర్ స్కేటింగ్ రింక్ గ్రౌండ్‌ను నిర్మించామని, అక్కడ శిక్షణ తీసుకున్న నందిత ఇన్‌లైన్ స్కేటింగ్ హాకీ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల రాజగోపాల్, కార్యదర్శి రామకృష్ణ, కోచ్‌లు శ్రీనివాస్, సత్యంలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

ప్రిన్సిపాల్ కుటుంబానికి పీఆర్‌టీయూ టీఎస్ ఆర్థిక సాయం



ప్రిన్సిపాల్ నరసింహ సతీమణికి చెక్కు అందజేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

మలక్‌పేట: ఎన్నికల విధుల్లో పాల్గొంటూ మృతి చెందిన టీఎంఆర్ఎస్ ముషీరాబాద్ బాలుర-1 పాఠశాల ప్రిన్సిపాల్, పీఆర్‌టీయూ టీఎస్ క్రియాశీలక సభ్యుడు బి.నరసింహ కుటుంబాన్ని పీఆర్‌టీయూటీఎస్ నేతలు గురువారం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్‌పూర్ గ్రామంలో కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి.. ప్రిన్సిపాల్ సతీమణి వర్షితకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కును అందజేసినట్టు హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెలి కమలాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని నరసింహ చిత్రపటానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన అధికారులు



ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లోని రికార్డులను తనిఖీ చేస్తున్న లోకేష్‌కుమార్, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోత్రు

నాగోలు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంను గురువారం అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డీఎస్ లోకేష్‌కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోత్రు తదితరులు సందర్శించారు. ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు వివరాలను తెలుసుకున్నారు. ఈవీఎంలు భద్రపరిచన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయిధ బలగాలతో పటిష్ట రక్షణ చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎన్నికల అధికారి పంకజ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌నగర్‌లోని జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం



దిల్‌సుఖ్‌నగర్‌లో వరద..



ఎల్‌బీనగర్‌లో..



దిల్‌సుఖ్‌నగర్‌లో...



చైతన్యపురిలో..

వాన.. వరద

- ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లు
- వాహనదారుల అవస్థలు
- ఈదురుగాలికి నేలకూలిన చెట్లు

చైతన్యపురి/దిల్‌సుఖ్‌నగర్: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎల్‌బీనగర్, నాగోలు, చైతన్యపురి, కొత్తపేట, వనస్థలిపురం, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, పద్మానగర్, మలక్‌పేట రైల్వే బ్రిడ్జి, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కే పురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లో దాదాపు 40 నిమిషాలు ఎడతెరిపిలేకుండా ఉరుములతో కూడిన వర్షం పడింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి.

గోదారిని తలపించిన రోడ్లు...

వాన నీటితో పాటు రోడ్లపై డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లు వరద గోదారిని తలపించాయి. జాతీయ రహదారిపై వరద చేరడంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు అవస్థలు పడ్డారు. మలక్‌పేట, నల్గొండక్రాస్ రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్లు వరద నీటితో నిండిపోవడంతో గుంతెక్కడో, రోడెక్కడో తెలియక వాహనదారులు అయోమయానికి గురయ్యారు. నీరు ఇంజిన్‌లోకి చేరి ద్విచక్ర వాహనాలు మొరాయించడంతో పలువురు వాహనదారులు వాటిని తోచుకుంటూ వెళ్లారు.

రోడ్డుపై పడ్డ చెట్లు..

ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు కాలనీల్లో చెట్లు కూలి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. సైదాబాద్‌లోని ఎల్ఐసీ కాలనీలో, చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌లో చెట్లు పడిపోయాయి. అదృష్టవశాత్తు ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, చెట్లు కూలి విద్యుత్ తీగల పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, వేసవి ఉక్కపోతతో అల్లాడుతున్న జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం పొందారు. వర్షాల సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావద్దని జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మ్యాన్‌హోల్ ఓపెన్ ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయం వద్ద వరదనీరు



ఓల్డ్‌మలక్‌పేట్‌లో వరదనీటికి రోడ్డు మధ్యలోకి కొట్టుకొచ్చిన ద్విచక్ర వాహనం



సైదాబాద్ ఎల్ఐసీ కాలనీలో నేలకూలిన చెట్టు



మన్సూరాబాద్ సాయినాథ్ కాలనీలో ప్రవహిస్తున్న వరదనీరు



మన్సూరాబాద్ అనితానగర్ కాలనీలో...



బండ్లగూడ శ్రావణ్ శ్రీ ఎన్‌క్లేవ్‌లోకి చేరిన వరదనీరు



చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌లో కూలిన చెట్టు



ఎల్‌బీనగర్ చింతల్‌కుంట జాతీయ రహదారిపై వరద ఉధృతి



వరదనీరు సాఫీగా పోయేందుకు నాలాలు క్లీన్ చేయిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

30 నుంచి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(ఎస్ఏటీఎస్) సమన్వయంతో యోనెక్స్ సన్‌రైజ్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లెల గోపిచంద్, ప్రధానకార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 2 తేదీ వరకు కొత్తపేట న్యూనాగోల్‌లోని ఆర్3 బ్యాడ్మింటన్ ఎక్సెలెన్సియాలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇది రాష్ట్ర సబ్–జూనియర్, జూనియర్, పురుషులు, మహిళలు, మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌ల ఎంపిక టోర్నమెంట్ అని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 26 తేదీలోగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సింగిల్స్ పాల్గొనే క్రీడాకారులు రూ.800, డబుల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 77889 93006 98480 15443 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ప్రభుత్వం నాటక రంగాభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జాతీయ నాయకుడు పేరాల శేఖర్‌జీ అన్నారు. రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ సహకారంతో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్‌కే పురం డివిజన్‌లోని చిత్ర లేఅవుట్ సంక్షేమ సంఘం భవనంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేఖర్‌జీ మాట్లాడుతూ, కనుమరుగవుతున్న నాటకాన్ని బతికించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఎస్వీ రామారావు మాట్లాడుతూ, గతంలో నాటకాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేదని, సినీ, టీవీ రంగాలు వచ్చిన తర్వాత ఇప్పటి ప్రజానీకానికి నాటకం గొప్పతనం తెలియడం లేదని, నాటకం విలువ తెలుసుకోవాలని కోరారు. ఇలా ఉండగా శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకంలో శ్రీకృష్ణుడి పాత్రలో అక్కిరాజు సుందర రామకృష్ణ, దుర్యోధనుడిగా చిట్టి బాలనాగేశ్వరరావు, అర్జునుడిగా మంగపతిరావు, కర్ణుడిగా వడ్డే సూర్యప్రకాష్ తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం నాటకంలోని పాత్రధారులకు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్, మురళీమోహన్ రాజు, ఎం.రామచంద్రరావు, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, లింగారెడ్డి, డాక్టర్ రామచంద్రరావు, నాగేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి, అప్పారావు, అనిల్‌కుమార్, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 21, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 35. దొండ 33, ఆలు 32, ఉల్లి 22, గోకర 35, దోస 18, సొర 11, పొట్ల 18, అరటి 8, చిక్కుడు 65, అర్వి 45, మునగ 35, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 45. శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు

మీర్‌పేట: పాత గొడవల నేపథ్యంలో దాడికి పాల్పడిన ఐదుగురిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన బొమ్మనబోయిన వెంకట్, సరిత భార్యాభర్తలు. వెంకట్ సినీ నటుడు పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. వీరి ఇంటి ఎదురుగా నివాసముండే రమావత్ రఘు, సంధ్యతో పదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం మాటామాటా పెరగడంతో వెంకట్ మరో ఇద్దరితో కలిసి రఘుపై దాడి చేశాడు. దీంతో రఘు సాయంత్రం తన బంధువులతో కలిసి కర్రలు, రాళ్లతో వెంకట్ ఇంటిపై దాడి చేసి ద్విచక్ర వాహనాలతో పాటు ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుడు వెంకట్ ఫిర్యాదు మేరకు రఘు అతని భార్య సరిత, మరో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన: నిందితుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు ఇచ్చారు. కోర్టు పీపీ సునీతా బర్ల గురువాం తెలిపిన వివరాల ప్రకారం...మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నస్లయ్ బుచ్చయ్య (47) ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. అదే ప్రాంతంలో నివసించే బాలిక (7) 2023, సెప్టెంబర్ 17వ తేదీన స్కూల్ నుంచి భయపడుతూ ఇంటికి వచ్చి ఏడుస్తుండటంతో తల్లి ఏమైందని ఆరా తీసింది. బుచ్చయ్య తనకు చాక్లెట్ ఇచ్చి ఇంటికి రమ్మన్నాడని తెలిపింది. ఈ ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎల్‌బీనగర్ ఎస్సై టి.మధు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను విచారించిన కోర్టు గురువారం నిందితుడికి 3 ఏళ్ల కారాగార శిక్షతో పాటు రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేశారు.

దివ్యాంగుడి అదృశ్యం



సంజయ్‌దేవ్

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మూగ, మానసిక దివ్యాంగుడు కనిపించకుండాపోయిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన సంజయ్‌దేవ్ (23) నాగోలు కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే తమ బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి కొన్ని రోజుల క్రితం వచ్చాడు. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో సంజయ్‌దేవ్ కిరాణా షాపుకని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం రాత్రి నాగోలు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి బీరప్ప స్వామి బ్రహ్మోత్సవాలు

- ఆదివారం బోనాలు
- సోమవారం స్వామివారి కల్యాణమహోత్సవం



వేడుకలకు ముస్తాబైన బీరప్ప స్వామి ఆలయం



బీరప్ప ఆలయం ప్రధాన ద్వారం

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు సమీపంలో ఉన్న బీరప్ప స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి (శుక్రవారం)నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్ట్ చైర్మన్ కర్రె శంకర్, ప్రధాన కార్యదర్శి జమ్ము కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 8.16 గంటలకు మైలల తీయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, శనివారం ఉదయం 11 గంటలకు కొట్నం పెట్టుట, సాయంత్రం 4 గంటలకు జల్దీ గంగా స్నానం కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు బీరప్ప స్వామి బోనాల ఊరేగింపు, రాత్రి 10 గంటలకు బీరప్ప స్వామి చరిత్ర ఒగ్గుకథ రూపంలో వివరించడం, సోమవారం ఉదయం 8.56 గంటలకు బీరప్ప స్వామి–కామరాతిదేవి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరుగుతుందని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

దాతలకు కృతజ్ఞతలు



గత కొన్నేళ్లుగా భక్తులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టాం. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు. వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. బీరప్పస్వామి– కామరాతి దేవి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశాం.

– కర్రె శంకర్ పెద్దకురుమ, బీరప్ప ఆలయ ట్రస్ట్ చైర్మన్

ప్రప్రథమంగా నిర్వహిస్తున్నాం



మన్సూరాబాద్ పెద్దచెరువు సమీపంలోని విశాలమైన స్థలంలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రప్రథంగా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులు ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయపక్షాల నేతలు, కురుమ కుల సంఘం పెద్దలు వార్షికోత్సవాలకు హాజరువుతున్నారు. – జమ్ము కృష్ణయ్య, ఆలయ ప్రధాన కార్యదర్శి



వెల్‌డన్ స్టూడెంట్స్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పదో తరగతి (సీబీఎస్ఈ) విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. ఇటీవల విడుదలైన పరీక్షాఫలితాల్లో ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తురగ పద్మ జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో డీపీఎస్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొమరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొనవలసిందిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని గురువారం ఆలయ భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే విడుదల చేశారు. కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించాలని, అన్నివిధాల తన సహాయ, సహకారాలుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్, విద్యుత్ శాఖల సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ పరిసరాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చందు, జగదీశ్వర్‌యాదవ్, అర్చకులు లక్ష్మణ్, ఆలయ భక్త బృందం కృష్ణ, టీ.కృష్ణ, రవీందర్, లక్ష్మణ్, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.